సాక్షి
హనుమకొండ

బుధవారం | 19 | జూలై | 2023



రాష్ట్రంలో నిరంతర ఉచిత విద్యుత్

రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నిరంతరంగా ఉచిత విద్యుత్ ఇస్తున్నాడని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸



కొలువు..గెలువు

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు మైనార్టీస్ స్టడీ సర్కిల్, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$26^0 / 24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం అయిఉంటుంది. పలుప్రాంతాల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వానలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్ బీఓఎస్‌గా కనకరత్నం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కనకరత్నం నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ టి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. కుప్పంలోని ద్రావిడ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కనకరత్నం డిప్యూటేషన్‌పై కేయూ హిస్టరీ విభాగంలో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు బీఓఎస్‌గా బాధ్యతలను నిర్వర్తించిన టి.మనోహర్ నుంచి ఆయన మంగళవారం బాధ్యతలను స్వీకరించారు.

మొబైల్ నంబర్లు నమోదు చేసుకోవాలి

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల పరిధిలోని ఆసరా పెన్షన్‌దారులు తమ మొబైల్ నంబర్లను ఆయా మున్సిపాలిటీ కార్యాలయాల్లోని పెన్షన్ విభాగంలో నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఓ సంపత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఇచ్చిన మొబైల్ నంబర్లను ఆసరా సైట్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలోనే పెన్షన్ మంజూరై వివిధ కారణాలతో డబ్బులు తీసుకోలేని వారు ఆధార్ నంబర్లు అప్‌డేట్ చేసుకోవాలని, బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడింగ్ మ్యాపింగ్ చేసుకుంటేనే పెన్షన్ డబ్బులు వారి ఖాతాల్లో జమవుతాయని డీఆర్‌డీఓ తెలిపారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన కేయూ వీసీ రమేష్



కేయూ క్యాంపస్: బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఇటీవల కాకతీయ యూనివర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేయూ వీసీ తాటికొండ రమేష్ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కేయూకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిన విషయాన్ని వారికి వివరించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వాకాటి కరుణ, నవీన్‌మిట్టల్ ఈ సందర్భగా వీసీ రమేష్‌ను అభినందించారు.

విద్యాసంస్థలకు నిధులు మంజూరు చేయాలి




హన్మకొండ: ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ వాకాటి కరుణను కలిశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో నూతనభవన నిర్మాణానికి రూ.33 కోట్లు నిధుల మంజూరు చేయాలని, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ల పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన వాకాటి కరుణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారని చీఫ్‌విప్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మొదటి విడత అడ్మిషన్లకు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.సుక్రు ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్ టెక్నీషియన్ ట్రేడ్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 10 శాతం ఐఎంసీ ఫీజు పేమెంట్ సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు హనుమకొండలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

టీచర్లకు మలిదశ శిక్షణ

- జిల్లాలో ఈనెల 21 నుంచి 24వరకు డీఆర్పీలకు
- ఈనెల 26 నుంచి మండలాల్లో 1,100 మంది టీచర్లకు..
- విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే 'తొలిమెట్టు' లక్ష్యం



విద్యారణ్యపురి: గత విద్యా సంవత్సరం విద్యాశాఖ 'తొలిమెట్టు' కార్యక్రమానికి నాంది పలికి కొంత ప్రగతిని సాధించింది. పాఠశాల విద్యా డైరెక్టర్ దేవసేన సైతం జిల్లాలో పర్యటించిన సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి ప్రశంసించారు. గత లోపాలను సవరించుకుంటూ హనుమకొండ జిల్లాలోని ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి ఆగస్టు మొదటివారం వరకు వివిధ దశల్లో ఉపాధ్యాయ శిక్షణ ఇవ్వనుంది. ఈనెల 21 నుంచి (మధ్యలో ఆదివారం సెలవు) 24 వరకు 84 మంది డీఆర్పీలకు హనుమకొండ జిల్లా కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు. వీరు టీచర్లకు మండల స్థాయిలో ప్రాథమిక విద్యనందించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

మరింత పకడ్బందీగా..

గత విద్యా సంవత్సరం ఫలితాలను అంచనా వేసి మరింత పకడ్బందీగా తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరించి ఈవిద్యా సంవత్సరం శిక్షణను రూపొందించారు. ప్రతీ ఉపాధ్యాయుడికి కనీసం రెండ్రోజుల శిక్షణను తొలిమెట్టులో భాగంగా ఇవ్వనున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో స్టేట్ రిసోర్స్ గ్రూపు టీచర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి పది మంది ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి శిక్షణ పొందారు. ఆయా ఉపాధ్యాయుల ద్వారా జిల్లాలో 14 మండలాల్లోని 1,100 మంది ఉపాధ్యాయులకు ఈనెల 26 నుంచి ఆగస్టు మొదటివారం వరకు తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులపై మండల స్థాయిలో శిక్షణను ఇవ్వనున్నారు. 304 పీఎస్‌లు, 60 యూపీఎస్‌లు, 2 హైస్కూళ్లు, ఒక యూఆర్ఎస్‌కు సంబంధించిన, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు మాత్రం జిల్లా కేంద్రంలోనే శిక్షణ ఉంటుంది.

తొలిమెట్టులో అదనంగా ఏం చేర్చారంటే..

ఈవిద్యా సంవత్సరంలో తొలిమెట్టు శిక్షణలో భాగంగా మరికొన్ని కొత్త అంశాలను చేర్చారు. బోధనా అభ్యసన ప్రక్రియల్లో ముఖ్యంగా పాఠ్యపుస్తకాలను వినియోగించడం, పాఠ్య ప్రణాళికలను ఉపయోగించడం, బోధనోపకరణాలను ఉపయోగించడం ద్వారా బోధించడానికి ఈ శిక్షణను ఉపయోగించనున్నారు. ఈసారి ప్రతీ విద్యార్థికి వారి తరగతికి సంబంధించిన తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టుకు సంబంధించి వర్క్ బుక్స్ ఇవ్వనున్నారు.

ప్రతినెలా సమీక్షలు

ఈకార్యక్రమాన్ని శిక్షణకే పరిమితం కాకుండా.. గతేడాది మాదిరిగానే ఈసారి ప్రతినెలా 27వ తేదీన పాఠశాల స్థాయిలో, 28వ తేదీన మండలస్థాయిలో, 29వ తేదీన జిల్లా స్థాయిలో తొలిమెట్టు ప్రగతిపై సమీక్ష నిర్వహించనున్నారు. విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు ఒకటి నుంచి 5 తరగతులు అభ్యసించే విద్యార్థులంతా వారి తరగతిలోని సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలను ఈ కార్యక్రమం ద్వారా సాధిస్తారు. దానికి నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

గుణాత్మక విద్య కోసమే తొలిమెట్టు

- డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి : జిల్లాస్థాయిలో ఈనెల 21, 22, 24 తేదీల్లో హనుమకొండలో నిర్వహించనున్న డీఆర్పీల శిక్షణ, ఆ తర్వాత నిర్వహించనున్న ఉపాధ్యాయుల శిక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై కోరారు. డీఈఓ కార్యాలయంలోని డీసీఈబీ భవనంలో మంగళవారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్‌నోడల్ అధికారులు, ఎంఈఓలు, రిసోర్స్ పర్సన్ల సమావేశంలో ఆ యన మాట్లాడారు. విద్యార్థులకు గుణాత్మక విద్య లక్ష్యంగా తొలిమెట్టును అమలు చేయాలన్నారు. ఈ విద్యాసంవత్సరం కూడా కొనసాగిస్తూ విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపిక చేసిన రిసోర్స్ టీచర్లు అందరూ కూడా తాము సబ్జెక్టులకు సంబంధించి కూడా పాఠ్యపుస్తకాలను తీసుకొని శిక్షణకు రావాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కనీసం ఒక సబ్జెక్టులో, గరిష్ఠంగా రెండు సబ్జెక్టుల్లో శిక్షణ తీసుకునే విధంగా ఉపాధ్యాయులను గుర్తించాలని మండల నోడల్ అధికారులను కోరారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ, జీసీడీఈఓ సునీత, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఈఓలు రాంకిషన్‌రాజు, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి, రవీందర్, ధర్మసాగర్ మండల నోడల్ అధికారి బి.రాంధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై

టీచర్లకు అవగాహన కల్పించడమే లక్ష్యం



ప్రాథమిక పాఠశాలల్లోని ప్రతీ ఉపాధ్యాయుడికి అవగాహన పెంచడమే లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నాం. మండల విద్యాశాఖ అధికారులు, తొలిమెట్టు నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈకార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించేలా మార్గదర్శకాలిస్తున్నాం. కనీసం 140 పనిదినాలు తొలిమెట్టుపై విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి, కేంద్రీకృత బోధన చేస్తారు.

– శ్రీనివాస్, అకడమిక్ మానిటరింగ్ అధికారి, హనుమకొండ

నిరంతర పర్యవేక్షణ



గత విద్యా సంవత్సరం జిల్లాలో అమలు చేసిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రగతిని గమనించాం. విద్యార్థుల్లో ఆత్మన్యూనతాభావం తగ్గి పాఠశాలకు రావాలనే ఆసక్తి పెరిగింది. విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగింది. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన కొనసాగుతోంది. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా జిల్లాలో విద్యా ప్రమాణాలు పెంచడమే మా లక్ష్యం.

– డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ హై, డీఈఓ, హనుమకొండ

కుటుంబ నియంత్రణకు ముందుకు రావాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హసన్‌పర్తి: కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సకు పురుషులు ముందుకు రావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా మంగళవారం హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పురుషుల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని,మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోగుల నమోదు శాతాన్ని పెంచాలని,సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి బి.సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్ పాషా,డాక్టర్ వాణిశ్రీ,డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ విజయరామారావు, డాక్టర్ వెంకట్‌రెడ్డి,'డాక్టర్ క్రాంతి, సీహెచ్ఓ లచ్చు, మాధవరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు సంతోష్, నాగేష్, ఉదయ్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

రైతులకు రూ.లక్ష రుణ మాఫీ చేయాలి

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి

హన్మకొండ/కరీమాబాద్: కేసీఆర్ ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. రైతులకు రూ.లక్ష రుణ మాఫీ చేయాలని, ఫసల్ బీమా అమలు చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కిసాన్ మోర్చా హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నక్కలగుట్టలోని వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు గేట్ వేసి అడ్డుకున్నారు. ధర్నా విరమించుకుని వెళ్లిపోవాలని పోలీసులు సూచించినా వినిపించుకోకపోవడంతో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రావు పద్మ, కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ రైతు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని రైతులే గద్దెదింపడం ఖాయమని హెచ్చరించారు. ధర్నాలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, నాయకులు గురుమూర్తి శివకుమార్, ఎడ్ల అశోక్‌రెడ్డి, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, పుల్యాల రవీందర్‌రెడ్డి, శేషాద్రి, రెండు జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరంగల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు

'కుడా' అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

కరీమాబాద్: వరంగల్ పరిధిలో చేపట్టిన 'కుడా' అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని వరంగల్ కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ ప్రావీణ్య అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం వరంగల్ బస్‌స్టేషన్‌కు సంబంధించిన డిజైన్, ఎస్టిమేషన్, డ్రాయింగ్స్‌పై కుడా చైర్మన్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ బస్‌స్టేషన్‌కు సంబంధించి ఎస్టిమేషన్లు ఈ నెల 31వ తేదీలోగా అందజేయాలని ఆదేశించారు. భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణంపై ఇరిగేషన్ సూపరింటెండెంట్లతో చర్చించి, రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఎల్ఓలు సమర్థవంతమైన, స్పష్టమైన ఎలక్టోరోల్‌ను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఫొటో ఎలక్టోరోల్స్ 2వ ఎస్ఎస్ఆర్ 2023పై బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

సాగుకు 24 గంటల నాణ్యమైన విద్యుత్

రైతు సదస్సులో ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: మూడు గంటల కరెంట్ కావాలా..? మూడు పంటలు కావాలా..? మత పిచ్చి లేపే బీజేపీ కావాలా..? రైతులే తేల్చుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో విద్యుత్ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కమలాపూర్‌లోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో సాగుకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేసి రైతును రాజుగా చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గతంలో కరెంట్ కోసం రేయింబవళ్లు రైతులు పడిగాపులు పడేవారని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పరిస్థితి లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా హుజూరాబాద్ నియోజకవర్గంలోని 1.17 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ పార్టీకి రైతులంతా అండగా ఉండి, కేసీఆర్ ప్రభుత్వానికి మరోసారి అధికారం కట్టబెట్టాలని కోరారు. ఎవరు అవునన్నా కాదన్నా సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించే బాధ్యత తనదేనన్నారు. అనంతరం కమలాపూర్‌లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, జెడ్పీటీసీ నాందిగె కల్యాణి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్యాల రవీందర్‌రెడ్డి, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

పున్నేలులో అధికారుల తనిఖీలు

- రంగసముద్రం, బాబాయి కుంటల పరిశీలన

ఐనవోలు: మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సంయుక్తంగా మంగళవారం పున్నేలు గ్రామంలో పర్యటించి తనిఖీలు చేపట్టారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మట్టి తరలింపు, అక్రమ వెంచర్లపై ఇటీవల ఎమ్మెల్యే అరూరి రమేష్ సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అధికారుల బృందం పర్యటించి విచారణ చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కోరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నాలుగు శాఖల అధికారులు గ్రామంలోని రంగసముద్రం చెరువు, బాబాయి కుంటలను తనిఖీ చేశారు. రంగసముద్రం చెరువు నుంచి సుమారు 8000 క్యూబిక్ మీటర్ల మట్టి తరలిపోయినట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా రియల్టర్లు బాబాయి కుంట చెరువు బఫర్ జోన్‌లోకి అక్రమంగా వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా గోడ నిర్మించారు. తనిఖీలకు సంబంధించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కుంట వద్ద అక్రమంగా నిర్మించిన గోడను వెంటనే తొలగించాలని తనిఖీకి వచ్చిన అధికారులు ఎంపీఓ, జీపీ అధికారులను ఆదేశించగా వర్షాల కారణంగా రెండు రోజుల్లో కూల్చివేస్తామని చెప్పినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో మైనింగ్ ఆర్ఐ సురేఖ, ఇరిగేషన్ డీఈ శంకర్, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీఓ రఘుపతిరెడ్డి, రెవెన్యూ శాఖ నుంచి సర్వేయర్ శ్రీకాంత్, ఏఎస్సై సత్యనారాయణ, సర్పంచ్ కత్తి దేవేందర్, రైతులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



చెరువులో అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏసీఎస్ఓగా నర్సింహారావు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ (ఏసీఎస్ఓ)గా కేవైఎల్.నర్సింహారావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన షేక్ నసీరుద్దీన్‌ను సర్కిల్ –4, సీఆర్ఓగా హైదరాబాద్‌కు బదిలీ చేశారు. రంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కేవైఎల్ నర్సింహారావును జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోజంతా ముసురు

జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం

- సగటు వర్షపాతం 58.5 మిల్లీమీటర్లు
- మరో రెండు రోజులపాటు వానలు
- కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

హన్మకొండ: ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇది కాస్త అల్పపీడనంగా మారనుందని వాతావరణ శాఖ పేర్కొంది. దీంతో మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. జూన్‌తో పాటు జూలైలో 15 రోజుల పాటు ఎండ తీవ్రత కొనసాగింది. ఈ సీజన్‌లో మోస్తరు వర్షాలే కురిశాయి. ఇప్పటి వరకు జల్లులు పడ్డ నేలలో ఒక్క రోజుకు మించి తేమలేదు. దీంతో మెట్టపంటల సాగుకు అవరోధంగా మారింది. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురుతో వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి. హనుమకొండ జిల్లాలో ఈ నెల 17 ఉదయం 8.30 నుంచి 18 ఉదయం 8.30 గంటల వరకు 58.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లాలో 28.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడగా, వరంగల్ జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది.

నడికూడలో 85.3 మిల్లీమీటర్ల వర్షపాతం..

హనుమకొండ జిల్లాలో అత్యధికంగా నడికూడలో 85.3 మిల్లీమీటర్లు కమలాపూర్‌లో 83.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పరకాలలో 81.1, భీమదేవరపల్లిలో 55.2, వేలేరులో 34, ఎల్కతుర్తిలో 73.7, హసన్‌పర్తిలో 75.1, ధర్మసాగర్‌లో 38.3, కాజీపేటలో 31.2, హనుమకొండలో 32, ఐనవోలులో 19.5, దామెరలో 73.1, ఆత్మకూరులో 70.2, శాయంపేటలో 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నల్లబెల్లిలో 50.5 మిల్లీమీటర్ల వర్షపాతం..

వరంగల్ జిల్లాలో అత్యధికంగా నల్లబెల్లిలో 50.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దుగ్గొండిలో 47.8 మిల్లీమీటర్లు, వరంగల్‌లో 42, గీసుకొండ 37.1, నర్సంపేట 30.9, ఖానాపురం 23.6, చెన్నారావుపేట 23.2, సంగెం 24.4, వర్ధన్నపేట 11.3, రాయపర్తి 13.8 పర్వతగిరి 16.9, నెక్కొండ 18, ఖిలా వరంగల్‌లో 35.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



వరంగల్ నగరంలో కురుస్తున్న వర్షం

వరంగల్ జిల్లా అధ్యక్షులకు గడ్డు కాలమే..!

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరిపై అసంతృప్తి సెగలు
- కాంగ్రెస్ పార్టీలోనూ పైకి కనిపించని కలవరం
- అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు స్థానిక నేతలతో కుదరని సయోధ్య



అరూరి రమేష్



ఎర్రబెల్లి స్వర్ణ

సాక్షి, వరంగల్: ఏ సంఘం.. రాజకీయపార్టీ అయినా అధ్యక్ష స్థానం కోసం నాయకులు ఆరాటపడతారు. ఆ పదవి దక్కిందంటే ఎంతో ఆనందంగా ఉంటారు.. కానీ, వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ఈసారి టికెట్ ఇస్తే మేం సహకరించబోమంటూ కొందరు ముఖ్యనేతలు నిరసన గళం వినిపించడంతో ఆయన రాజకీయ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. పార్టీ అధ్యక్షుడి పరిస్థితి మిగిలిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. ఏవైపు నుంచి ఎవరు అసంతృప్తి గళం వినిపిస్తారోనన్న టెన్షన్‌తో ఉన్నారు. ప్రతిపక్షాల నుంచి పోటీ ఉంటుందనుకుంటే ఉన్న పార్టీవారే లొల్లి చేస్తుండడంతో అధికార పార్టీ నేతలు అయోమయంలో పడ్డారు.

ఎర్రబెల్లి స్వర్ణకు కష్టకాలమే..

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరంగల్ తూర్పు టికెట్ రావడం కష్టమేనన్న సంకేతాలు రావడంతో అయోమయ పరిస్థితిలో ఉందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. అయితే ఆమె పార్టీ కోసమే పనిచేస్తున్నానని, టికెట్ నాక్కావాలని ఎప్పుడూ ఎవర్నీ అడగలేదని ఆమె క్లారిటీ ఇస్తున్నా.. ప్రచారం మాత్రం ఆగడం లేదు. దీనికి తోడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా స్వర్ణకు ఆయా ప్రాంతాల స్థానిక నేతల నుంచి సానుకూలత రాకపోవడంతో ఆమె అసహనానికి గురవుతున్నట్లుగా పార్టీలో చర్చ జరుగుతోంది. దీనికితోడు జిల్లాలోని వివిధ కమిటీల నియామకాల్లోనూ తమ మాట చెల్లుబాటు కాకపోవడంతో పార్టీపై ఆమె అలకబూనారన్న ప్రచారం ఉంది. ఇటీవల నియమించిన మహిళా కమిటీల పేర్ల విషయంలో అధ్యక్షురాలిగా తాను చెప్పిన వారికి కాకుండా ఇతరులకు చోటు కల్పించడంతో ఆమె గుర్రుగా ఉన్నారని తెలిసింది. అయితే రాహుల్‌గాంధీపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ తమ సొంతూరు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మంగళవారం జరిగిన రాస్తారోకోలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలి హోదాలో ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొనాల్సి ఉన్నా రాకపోవడంతో పార్టీల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎందుకంటే రాహుల్ గాంధీపై వ్యాఖ్యలను ఖండించాల్సిన ప్రాధాన్యత ఉన్న కార్యక్రమంలో ఆమె పాల్గొనకపోవడంతో అసలు కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతుందన్న చర్చ మొదలైంది. ఇప్పటికే వర్ధన్నపేట కేంద్రంగా ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై అసంతృప్తి రగులుకుంటే.. అదే వర్ధన్నపేట కేంద్రంగా జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత కార్యక్రమంలో ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొనకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ హాట్ టాపిక్‌గా మారింది.

అరూరి విషయంలో తగ్గేదేలే..!

- మంత్రి ఎర్రబెల్లిని కలిసిన అసంతృప్తి నేతలు

సాక్షి, వరంగల్: వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేష్‌పై అసంతృప్తి గళం విప్పిన ముఖ్య నేతలు తగ్గేదే లేదని ముఖ్యనేతలకు చెప్పినట్లుగా తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పర్వతగిరిలోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసానికి అసంతృప్తి నేతలు వచ్చి మరోమారు నిరసన గళం విప్పినట్టుగా తెలిసింది. అరూరి రమేష్‌కు టికెట్ ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో సహకరించబోమని తేల్చిచెప్పినట్టుగా జోరుగా చర్చ జరుగుతోంది. దీంతో అసంతృప్తి చల్లార్చేందుకు ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన ప్రయత్నం పెద్దగా ఫలించినట్టుగా లేదని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. ఇదిలా ఉండగా హనుమకొండలోని ఎమ్మెల్యే అరూరి రమేష్ నివాసానికి ఆయా మండలాల నుంచి కొందరు పార్టీ నేతలు వచ్చి కలిశారు. దీంతో అక్కడ వాతావరణం మంగళవారం ఉదయం సందడిగా కనిపించినా.. సాయంత్రం మళ్లీ అసంతృప్తి సెగలు తాకడంతో వర్ధన్నపేట నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొన్నట్లు స్పష్టమవుతోంది.

లైంగికదాడి, హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కేసముద్రం: ఓ మహిళపై లైంగికదాడికి పాలడ్పిన అనంతరం ఆమెను హత్యచేసిన ఓ వ్యక్తికి మహబూబాబాద్ కోర్టు మంగళవారం జీవితఖైదు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసముద్రం మండలంలో కాట్రపల్లి గ్రామానికి చెందిన మహిళ మాధవపెద్ది విజయ కేసముద్రంస్టేషన్‌లోని ఉప్పరపల్లి రోడ్డువైపు ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. కాగా, 2011 ఆగస్టు 9న రాత్రి కరీంనగర్ జిల్లా కాటారం మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి చల్లా మహేశ్.. విజయపై లైంగికదాడికి దాడికి పాల్పడిన అనంతరం ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారంతో వెళ్లిపోయాడు. దీనిపై నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన మృతురాలి సోదరుడు కొంకాల వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎస్సై డేవిడ్‌రాజ్, రూరల్ సీఐ అంజయ్య.. నిందితుడిని రిమాండ్ చేశారు. అనంతరం చార్జీషీట్ ఫైల్‌చేయగా కోర్టు డ్యూటీ ఆఫీసర్ అశోక్‌రెడ్డి, సిబ్బంది రవీందర్, దేవా.. 23 మంది సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు పీపీ చిలకమారి వెంకటేశ్వర్లు బాధితుల తరపున వాదించారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి మహబూబాబాద్ చంద్రశేఖర్‌ప్రసాద్.. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్షతోపాటు రూ.18వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నేరస్తుడికి శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టిన డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేశ్, ఎస్సై తిరుపతిని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

భార్యను హత్య చేసిన ఘటనలో భర్తకు..



సంపత్

టేకుమట్ల(రేగొండ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గాంధీనగర్ గ్రామంలో 2019లో నమోదైన హత్య కేసులో పల్లబోయిన సంపత్ అనే నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. పదివేల జరిమానా విధిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్జి పి. నారాయణ బాబు మంగళవారం తీర్పునిచ్చారు. పల్లెబోయిన సంపత్, సుమలత దంపతులు గాంధీనగర్‌లో నివాసం ఉండేవారు. మద్యానికి బానిసైన సంపత్.. 2019 సంవత్సరంలో సుమలతతో గొడవపడి కత్తితో పొడువగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై అప్పటి సీఐ సాయి రమణ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేయగా, ప్రస్తుత చిట్యాల సీఐ వేణు చందర్, రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ జ్యోతి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ ఘటనలో నేరం రుజువు కావడంతో సంపత్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పును తీర్పునిచ్చారు. కాగా, ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పి.పి జి. శివరాజు, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టిన రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, చిట్యాల సీఐ వేణుచందర్, కోర్టు కానిస్టేబుల్ జ్యోతిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ జే సురేందర్ రెడ్డి అభినందించారు.



కోచింగ్ సెంటర్‌లో క్లాస్ వింటున్న అభ్యర్థులు(ఫైల్)

కొలువు..గెలువు

- మైనార్టీ అభ్యర్థులకు సివిల్స్‌లో కోచింగ్
- దరఖాస్తుకు ఈనెల 23 వరకు గడువు
- వచ్చేనెల 6న స్క్రీనింగ్ టెస్ట్

న్యూశాయంపేట : సివిల్ సర్వీసెస్–2024 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు శుభవార్త. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. ఈ సంవత్సరంలో వందమంది అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ప్రముఖ కోచింగ్ సెంటర్లలో ఉచిత శిక్షణ అందించనుంది. ఇందులో భాగంగా యూపీఎస్సీ, సీఎస్ఏటీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైన్, బుద్దీస్, పార్శీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. స్క్రీనింగ్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారితంగా కోచింగ్ సెంటర్‌లో అడ్మిషన్ ఇస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాల్లో ఉన్న మైనార్టీ గురుకులాల్లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

అర్హత..

సివిల్స్ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలకు మించొద్దు. ఈ శిక్షణలో మహిళా అభ్యర్థులకు 33, దివ్యాంగుల కు 5 శాతం రిజర్వేషన్ ద్వారా సీట్లు కేటాయించారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుంది.

దరఖాస్తుకు గడువు

సివిల్ సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం డిగ్రీ పూర్తిచేసి సివిల్స్ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీతఈ టీ.జీఓవీ.ఇన్/టెమ్రిస్ నందు దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుకు గడువు ఈ నెల 23వ తేదీ.

స్క్రీనింగ్ టెస్ట్

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల(ఆగస్టు 6న) స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మైనార్టీలు సివిల్స్‌లో సత్తా చాటేందుకు శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర వివరాలకు 040–23236112 నంబర్‌లో గాని, ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలి.

కే.విక్రమ్‌కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, వరంగల్

'క్రీస్తుజ్యోతి'కి ప్రపంచ స్థాయి గుర్తింపు

- మందిరం వ్యవస్థాపకులు పాల్సన్ రాజ్, జయప్రకాశ్



మాట్లాడుతున్న పాల్సన్ రాజ్

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరానికి ప్రపంచస్థాయి గుర్తింపు రావడం ఎంతో అదృష్టమని మందిరం వ్యవస్థాపకులు దైవజనులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్, రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ అన్నారు. ఈమేరకు మంగళవారం వారు ప్రార్థనా మందిరంలో విలేకరులతో మాట్లాడుతూ ఆసియా ఖండంలో అతిపెద్దగా సుమారు 40 వేల మంది క్రైస్తవ విశ్వాసులు ఒకేసారి దేవుడి ప్రార్థనలో గడిపేలా అన్ని హంగులతో క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని నిర్మించామన్నారు. దీనిని మే 4వ తేదీన ప్రారంభించామన్నారు. చర్చి ప్రత్యేకత, తమ సేవ పరిచర్యను తెలుసుకుని రెండు అంతర్జాతీయ అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు జూన్ 16న యూఎస్ కాంగ్రెస్ మెన్ దానికె డేవిడ్ పీస్ ప్రైజ్ 2023, యూఎస్ హౌజ్ ఆఫ్ రిప్రజెంటివ్ కాంగ్రెసనల్ రివార్డు మెడల్, ప్రశంస పత్రం యూఎస్ ఎంపీ జోనతన్ జాక్సన్ చేతుల మీదుగా అందజేశారని తెలిపారు. ఈ రెండు అంతర్జాతీయ అవార్డులు రావడం ఆనందంగా ఉందని, అవార్డులు ప్రదానం చేసిన అమెరికా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

హన్మకొండ: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం అన్నారు. మంగళవారం హనుమకొండలో అసోసియేషన్ నాయకుడు ఇ.నరేందర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వాటిని పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 20న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ధర్నా చేయనున్నట్లు వివరించారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్లు చెల్లించడం లేదని, కార్పొరేట్ హాస్పిటళ్లలో హెల్త్ కార్డులపై వైద్యం అందించడం లేదన్నారు. జూలై 1 నుంచి వర్తించే కొత్త పే రివిజన్ కమీషన్ ఇంతవరకు వేయలేదని, బకాయి కరువు భత్య వాయిదాలను ప్రకటించలేదని మండిపడ్డారు. ఈ సమస్యలన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నారాయణగిరి వీరన్న, భేతి శంకర్ లింగం, ఆర్తి సంపత్ కుమార్, కరేటి శంకర్‌రావు పాల్గొన్నారు.

'మోడల్' టీచర్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



విచారణ చేపడుతున్న ఉన్నతాధికారులు

జనగామ రూరల్: మండలంలోని చౌడారం మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు.. తమను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విద్యార్థుల లేఖపై 'సాక్షి'లో ప్రచురితమైన 'రూపాయి బిల్లా, బాయిలా బంగారం 'అనే కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన కథనంపై విద్యాశాఖ మంత్రి దృష్టికి రాగా కలెక్టర్ వెంటనే స్పందించి డీఈఓను విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ కమిటీని నియమించారు. మంగళవారం నోడల్ అధికారి ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి సంఘాల వాయిస్‌లతో విద్యార్థినులు, ఉపాధ్యాయులను విచారించారు. నివేదికను బుధవారం ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

ప్రిన్సిపాల్‌తో పాటు సంబంధిత ఉపాధ్యాయులను తొలగించాలి

మోడల్ పాఠశాలలో విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసిన ఉపాధ్యాయులతో పాటు పూర్తి బాధ్యతగా ప్రిన్సిపాల్‌ను కూడా తొలగించాలి. ఏ పాఠశాలలో కూడా ఇలాంటి ఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలి.

-చిలువేరు అభిగౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్రంలో నిరంతర ఉచిత విద్యుత్



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రోజు నిరంతరంగా ఉచిత విద్యుత్ ఇస్తుండగా.. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాత్రం మూడు గంటలే ఇస్తున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం పాలకుర్తిలో రైతులతో ఏర్పాటు చేసిన సభలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులను పట్టించుకోలేదన్నారు. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, ఏఎంసీ చైర్మన్ ముస్కు రాంబాబు, సహకార సంఘం చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, భూమ రంగయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల రాస్తారోకో



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జాక్ (కేయూ)ఆధ్వర్యంలో మంగళవారం వర్షంలోనే హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కళాశాల ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జాక్ కన్వీనర్ డాక్టర్ చిర్రరాజు, వైస్ చైర్మన్ డాక్టర్ బి వెంకటగోపీనాథ్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో 15 నుంచి 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులరైజ్ చేయాలని కొంతకాలంగా కోరుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ గతేడాది జూలై 18న హనుమకొండకు వచ్చిన సందర్భంలో తమను రెగ్యులరైజ్ చేయాలని కోరగా చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలన్నారు. ఇటీవల కూడా మంత్రులు ,ఇతర ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఇటీవలనే ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారన్నారు. అలాగే, యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, రాస్తారోకోతో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో రాష్ట్ర జాక్ కోకన్వీనర్ డాక్టర్ మంతెన శంకరయ్య, బాధ్యులు డాక్టర్ టి రాధిక, డాక్టర్ టి నాగయ్య, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ రమేశ్, శ్రీదేవి, సునీత, కనకయ్య, స్వామి, ప్రసాద్, కర్రె సదాశివ, మామిడి లింగయ్య, పుల్లా రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పుప్పాలగుట్టలో సైకో వీరంగం

- ఇంట్లోకి చొరబడి ఓ వ్యక్తిపై దాడి
- ఆస్పత్రికి తరలింపు



స్థానికులు విద్యుత్ స్తంభానికి కట్టేసిన సైకో ఇతనే..

ఖిలా వరంగల్: వరంగల్ పుప్పాల గుట్టలో ఓ సైకో వీరంగా సృష్టించాడు. ఓ ఇంట్లోకి చొరబడి అ కారణంగా యువకుడిపై రోకలి బండతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాలనీకి చెందిన కొండేటి అంజమ్మ, సాయిలు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు శ్రీనివాస్(33) ఉన్నారు. కాగా, ఏపీలోని కాకినాడ రామచంద్రపురం గ్రామానికి చెందిన నీలం సత్యనారాయణకు మనసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో వరంగల్ చింతల్ బ్రిడ్జి సమీపాన రైలు దిగి కాలనీలోకి ప్రవేశించాడు. అనంతరం అనుకోకుండా శ్రీనివాస్ ఇంటి తలుపులను బలంగా కొట్టడంతో ఊడి కిందపడ్డాయి. వెంటనే పక్కన ఉన్న రోకలి బండతో ఇంట్లోకి ప్రవేశించి శ్రీనివాస్‌పై దాడి చేయగా ఆయనకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అడ్డుకోపోయిన మరో ఇద్దరిపై సైకో దాడికి పాల్పడ్డాడు. దీనిపై కుటుంబీకులు కేకలు వేయగా కాలనీ వాసులు చేరుకుని సైకోను పట్టుకుని దేహశుద్ధి చేసి మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. పలుమార్లు విచారించిన సమాధానం చెప్పలేని చెప్పలేదు. కనీసం పేరు కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాడు. అతడి మానసిక స్థితి సరిగా లేదని సీఐ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు కాగా, సైకో దాడిలో గాయపడిన కొండేటి శ్రీనివాస్‌ను స్థానిక సామాజిక వేత్త ఎల్.శ్రీనివాస్ పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

గంజాయి పట్టివేత కేసులో..

- ఒకరికి పదేళ్ల జైలు
- రూ. లక్ష జరిమానా

మహబూబాబాద్ రూరల్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు ఇచ్చారు. మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీశ్ కథనం ప్రకారం గతేడాది ఆగస్టు 8వ తేదీన అప్పటి టౌన్ ఎస్సై కె.క్రాంతికిరణ్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్నారు. శ్రీనివాస సెంటర్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో కనిపించగా అతడిని విచారించారు. రెండు బ్యాగుల్లో పరిశీలించగా 5 కేజీల ఎండు గంజాయి లభించింది. ఒడిశాలోని గంజాం జిల్లా నెయాలీశ్రీనిబాసపూర్ గ్రామానికి చెందిన తపన్ గౌడ్ ఒడిశా నుంచి గంజాయిని తీసుకువస్తున్నట్లు గుర్తించారు. పట్టుకున్న గంజాయిని టౌన్ సీఐ వై.సతీశ్‌కు అప్పగించి అప్పటి టౌన్ ఎస్సై కె.క్రాంతికిరణ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణ ద్వారా గతేడాది నవంబర్ 19న మహబూబాబాద్ జిల్లా కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు హెడ్ కానిస్టేబల్ బీరం సంపత్‌రెడ్డి, కానిస్టేబుల్ బానోత్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. వాదనలు విన్న మానుకోట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణ కావడంతో తపన్ గౌడ్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఎస్పీ సత్యనారాయణ అభినందించారు.

ఆన్‌లైన్ మోసం ..

- రూ.3.80 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

మహబూబాబాద్ రూరల్ : టెలిగ్రామ్ యాప్ పేరుతో వచ్చిన కాల్‌ను ఓ వ్యక్తి నమ్మాడు. అనంతరం తన ఫోన్‌కు వచ్చిన లింక్‌లో రూ.3.80 లక్షలు పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్జీఓస్ కాలనీకి చెందిన పెరుమాండ్ల శ్రవణ్‌కుమార్ సెల్ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం ఒక మెసేజ్ వచ్చింది. అధిక మొత్తంలో పెట్టుబడి పెడితే, అధిక లాభం వస్తుందని ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో శ్రవణ్ కుమార్ సదురు యాప్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో రూ.3.80 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. ఈ క్రమంలో మంగళవారం లింక్ ఓపెన్ చూడగా తన డబ్బు వివరాలు కనిపించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన శ్రవణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీశ్ తెలిపారు.

మాట మార్చిన ప్రేమికుడు..

- రెండేళ్ల తర్వాతే పెళ్లని బుకాయింపు..
- ప్రియురాలు, బంధువుల నిరసన

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో ప్రేమ వ్యవహారం బెడిసికొట్టింది. స్థానికులు, ఇరు వర్గాల బంధువుల కథనం ప్రకారం గీసుకొండకు చెందిన ఇంటర్ పూర్తి చేసిన యువతి, అదే మండలం బాలయ్యపల్లికి చెందిన డిగ్రీ చదివిన యువకుడు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం పెద్దలకు తెలియడంతో వారి ప్రేమ వ్యవహారం వివాదంగా మారింది. సదరు యువకుడితో పాటు అతడి బంధువులు ఆ యువతితో పెళ్లికి ససేమిరా అంగీకరించకపోగా మాట మార్చి రెండేళ్ల తర్వాత పెళ్లి అంటూ బుకాయిస్తున్నారు. దీంతో యువతి, ఆమె బంధువులు సోమవారం రాత్రి ప్రియుడి ఇంటి వద్ద నిరసన తెలిపారు. రెండేళ్లు కాదు..వెంటనే వివాహం జరగాలని పట్టుబట్టారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో యువకుడి బంధువులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించి శాంతింపజేశారు. కాగా, సోమ, మంగళవారాల్లో ఇరువర్గాల మధ్య రాజీ చర్చలు జరిగినా అవి ఫలించలేదని తెలుస్తోంది.

వేర్వేరు చోట్ల ఏడుగురి అదృశ్యం..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఏడుగురు అదృశ్యమయ్యారు. వరంగల్ కాశిబుగ్గలో స్నేహితుడి వద్దకు వెళ్లిన ఓ విద్యార్థి.. భర్త వేధింపులు భరించేలేక హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో కలిసి.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో ఓ యువతి.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన ఆటో డ్రైవర్ .. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యారు. వీరి ఆచూకీ కోసం ఆయా కుటుంబాలు బంధువులు, తెలిసిన చోట్లలో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

హసన్‌పర్తి : భర్త వేధింపులు భరించలేక భార్య తన ఇద్దరి పిల్లలతో కలిసి అదృశ్యమైంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశాపూర్‌కు చెందిన బోనగిరి యాదగిరి చిన్నకూతురు మమతతో ఆరేళ్ల క్రితం హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఆళ్ల ప్రభుకు వివాహం జరిగింది. ఇతర లాంఛనాలతోపాటు వ్యవసాయ భూమిని కట్నం కింద ఇచ్చారు. వీరికి కుమారుడు అక్షర్(5),కూతురు చిచ్చు(3)ఉంది. భూమి విషయమై దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భూమికి సంబంధించిన వాటా డబ్బు కూడా ప్రభుకు అందించారు. అయినా ప్రభు మారకపోవడంతో మమత తన పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై తండ్రి యాదగిరి.. భర్త వేధింపులు భరించలేక తన కూతురు మమత ఇంటి నుంచి వెళ్లిందని సోమవారం రాత్రి పోలీసుకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఎస్సై సురేశ్ తెలిపారు.

కాశిబుగ్గలో విద్యార్థి..

రామన్నపేట : కాశిబుగ్గకు చెందిన పరికిపండ్ల శ్రీధర్ కుమారుడు సిద్దార్థ అదృశ్యమయ్యారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 7 గంటలకు తన స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఆ యువకుడు.. ఇంత వరకూ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తండ్రి శ్రీధర్ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దార్థ.. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో బూడిదరంగు టీషర్టు, బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్ ధరించాడు. సిద్దార్థ ఆచూకీ తెలిసిన వారు ఇంతేజార్‌గంజ్ పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ పేర్కొన్నారు



సిద్దార్థ

బ్రాహ్మణ బజార్‌లో యువకుడు..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన సయ్యద్ సోహెల్ అదృశ్యమయ్యాడు. సోహెల్ హైదరాబాద్‌లో టాక్సీ ఆటో నడుపుకుంటూ అక్కడే ఉంటున్నాడు. బక్రీద్ సందర్భంగా ఈ నెల 6వ తేదీన ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్లాడు. అయితే సోహెల్ ఫోన్ చాలా రోజుల నుంచి కలవకపోవడంతో తండ్రి ఫైజోద్దీన్.. ఈ నెల 17వ తేదీన టాక్సీ యజమానికి ఫోన్ చేసి తన కుమారుడి గురించి ఆరా తీశాడు. సోహెల్ డ్యూటీకి రావడంలేదని యజమాని వివరణ ఇచ్చాడు. దీంతో ఫైజోద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై ఎస్.రవి మంగళవారం తెలిపారు.

పెద్ద ముప్పారంలో యువతి..

దంతాలపల్లి: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారంలో ఓ యువతి అదృశ్యమైంది. గ్రామానికి చెందిన హెచ్ ఐలయ్య, తన భార్య.. పని నిమిత్తం నెల 11వ తేదీన రాత్రి బయటకు వెళ్లి 12న ఉదయం ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి వద్ద తమ కూతురు కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఐలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు.

జమాండ్లపల్లిలో వ్యక్తి..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన దొండేటి రమేశ్ అదృశ్యమయ్యాడు. రమేశ్.. నెల క్రితం భార్య సుజాతతో గొడవపడ్డాడు. దీంతో ఆమె జమాండ్లపల్లి నుంచి వెళ్లిపోయి ఖమ్మంలోని తన పెద్ద కుమారుడు నరేశ్ ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ నుంచి రమేశ్ జమాండ్లపల్లిలోని తన ఇంటి వద్ద కనిపించడం లేదు. దీనిపై రమేశ్ కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ మంగళవారం తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

టేకుమట్ల(రేగొండ): పాముకాటుతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లింగాలలో జరిగింది. గ్రామానికి చెందిన ముత్యాల స్వరూప(45) తన ఇంటి వద్ద గల మొక్కజొన్న కుప్పపై పరదా తొలగిస్తోంది. ఈ క్రమంలో పరదా లోపల ఉన్న పాము కాటు వేసింది. దీంతో కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీనిపై మృతురాలి భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



స్వరూప(ఫైల్)